క్లుప్తంగా

రైతులకు మినీ కిట్ల పంపిణీ



మండవల్లి: మండలంలోని కానుకొల్లు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ ఎస్కే జరీనా ఆదేశాల మేరకు రైతులకు మినుములు వీబీఎన్–8 మినీ కిట్లు సర్పంచ్ నాగదాసి థామస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎన్డీఏ నాయకులు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రాము, ఫిషరీస్ అసిస్టెంట్ భవాని, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన అవసరం



పామర్రు: భూముల రీసర్వేపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక సచివాలయం–1 వద్ద సర్పంచ్ కేతావతు కస్తూరి అధ్యక్షతన రీసర్వే గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భూముల రీ సర్వేలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి తగు పరిష్కారం పొందాలన్నారు. భూముల రీసర్వే కోసం అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ఈ గ్రామ సభలో 20 దరఖాస్తులు వచ్చాయని, వీటిని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ రవికాంత్, డీటీ గంగాధరరావు, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం, ఆర్ఐ రాము పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి రజత సర్వాభరణం

పెదపారుపూడి: మండలంలోని వానపాముల గ్రామంలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారికి రజత సర్వాభరణాన్ని మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు, దాత డాక్టర్ వేదాంతం మోహన ధన్వంతరీ తన భార్య స్వర్గీయ శాంతిప్రియ జ్ఞాపకార్థం స్వామివారికి రజత సర్వాభరణాన్ని ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్‌కు అందజేశారు. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి వెంకట చిందబరం పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన



గుడివాడరూరల్: వరిసాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సైంటిస్ట్ యు.విజయభాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని చిలకమూడి, సీపూడి గ్రామాల్లో ఏఓ బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవితో కలసి ఆయన మాట్లాడారు. రైతులు ఎక్కువశాతం ఎంటీయూ–1318 రకం సాగు చేశారన్నారు. అందుకే ఎరువుల వినియోగంపై సరిపడా వాడాలని సూచించారు. ప్రస్తుతం పొలంలో రెండు అడుగుల మేర మాత్రమే నీరు ఉండాలన్నారు. అలాగే ఈ దశలో కచ్చితంగా పొటాష్‌ని సూటి ఎరువుల రూపంలో వినియోగించాలని కోరారు.

లింగాలలో..

మండవల్లి: మండలంలోని లింగాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ షేక్ జరీనా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వ్యవసాయశాఖ, ఫిషరీస్, వెటర్నరీలలో సబ్సిడీ స్కీముల గురించి ఆయా శాఖల అధికారులు వివరించారు.

పందుల స్వైర విహారం



మండవల్లి: పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో గ్రామస్తులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క వర్షాలకు రోడ్లపై వర్షం నీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పందులు కూడా ఆ నీటిలో తిరగడంతో అవస్థలు పడుతున్నారు. నీక్ష తొట్టెల వద్ద శుభ్రం చేయడానికి వేసిన ప్లేట్లను కలుషితం చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు గ్రామంలో పందులు తిరగకుండా గ్రామానికి వెలుపల ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నరకప్రాయం ఆ రహదారి

- మొవ్వ–అయ్యంకి రోడ్డు అడుగడుగునా గుంతలే
- ఎన్నికల హామీలు గాలికే



మొవ్వ ప్రధాన కూడలిలో రహదారి దుస్థితి

మొవ్వ: మండలంలోని అత్యంత ప్రధానమైన అయ్యంకి–మొవ్వ రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. మండల ప్రథమ గ్రామమైన అయ్యంకి రొయ్యల ఫ్యాక్టరీ వద్ద నుంచి మొవ్వలోని న్యాయస్థానం వరకు రోడ్డు పరిస్థితి నరక కూపంలా మారింది. అయ్యంకి అడ్డరోడ్డు, ముత్రాసిపాలెం డ్రాపు, పెదపూడి, కూచిపూడి, మొవ్వల వద్ద రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవటంతో దీనిపై ప్రయాణం కత్తి మీద సాములా మారింది. ఎన్నికల్లో గెలిచిన అనంతరం యుద్ధప్రాతిపదికన అయ్యంకి–కూచిపూడి, కూచిపూడి–మొవ్వ రహదారి పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గెలిచిన తరువాత దాని ఊసే మరిచారు. కనీసం మరమ్మతులకు సైతం నోచుకోక పోవటంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్న పాటి వర్షానికే ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తవుతున్నా ఈ రహదారికి మోక్షం కలగలేదని.. ఈ రహదారి అభివృద్ధి చేసి ప్రాణాలు కాపాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పెదపూడిలో గుంతలమయంగా మారిన రోడ్డు

అడుగు పడదు...కాలు కదలదు



పెదపాలెం వద్ద అధ్వానంగా మారిన రోడ్డు

గుడ్లవల్లేరు: మండలంలోని కొతవరం నుంచి డోకిపర్రు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వాహన చోదకులకు తమ ప్రయాణంలో ప్రత్యక్ష నరకం కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే రోడ్డుపై గోతుల్లో వర్షం నీరు చేరి ఎంత లోతు ఉందో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. వెంటనే ఈ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గురజాడ–మద్రివాడ రోడ్డుకు మోక్షమెప్పుడో?



పమిడిముక్కల: మండలంలోని గురజాడ–మద్రివాడ జెడ్పీ రోడ్డు అధ్వానంగా మారింది. రబ్బీష్ రోడ్డంతా పూర్తిగా పాడైపోయి ఉంది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు దట్టంగా పెరిగిపోయాయి. మద్రివాడ, గోపువాని పాలెం గ్రామస్తులు ఉయ్యూరు వెళ్లేందుకు దగ్గరగా ఉంటుంది. చెరకును కేసీపీకు తరలించేందుకు ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. మూడు గ్రామాల పరిధిలోని రైతులు పొలాలకు వెళ్లేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించి, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారింది



నాది మొవ్వ మండలం అయ్యంకి గ్రామం. ఎన్నో సంవత్సరాలుగాఅయ్యంకి–మొవ్వ రహదారి అభివృద్ధికి దూరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. కొద్దికాలంగా ప్రమాదాల సంఖ్య పెరిగింది. రోడ్డుని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.

– రాజులపాటి మురళి, అయ్యంకి గ్రామస్తుడు

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం

అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో రూ.60లక్షలు మంజూరయ్యాయి. సకాలంలో పనులు పూర్తి చేయకపోవటం వలన నిధులు రద్దయ్యాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– సురేష్, ఆర్అండ్‌బీ జేఈ

వసతి గృహాల తనిఖీ



ముదినేపల్లిలో బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి

ముదినేపల్లి రూరల్: కైకలూరు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎన్‌వీ లక్ష్మి ముదినేపల్లిలోని బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన భోజనంతో పాటు ఇతర సౌకర్యాలను నిబంధనలకు అనుగుణంగా అందజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్యానెల్ న్యాయవాది పి.ప్రసన్నకుమార్, ఏఎస్ఐ పద్మజ, హాస్టల్ అధికారులు పి.సురేష్‌బాబు, సిబ్బంది న్యాయమూర్తి వెంట ఉన్నారు.

హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మండల అధికారుల బృందం మంగళవారం పరిశీలించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. పాఠశాలలో 186 మంది విద్యార్థులకుగాను 160 మంది హాజరుకాగా వీరిలో 137 మంది మధ్యాహ్న భోజనాన్ని తీసుకున్నారు. మిగిలిన విద్యార్థులు భోజనం చేయకపోవటానికి గల కారణాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, ఎంఈవోలు శివశంకర రావు, శ్రీలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎంఎస్ కృష్ణపరమాత్మ, ఆర్ఐ విజయదుర్గ, హెచ్ఎం నాగమణి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొడాలి నాని పుట్టినరోజు



గుడ్లవల్లేరులో కొడాలి నాని బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ నేత శేషుబాబు

గుడ్లవల్లేరు: గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) జన్మదిన వేడుకలను అంగలూరు సెంటర్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకుడు దుగ్గిరాల శేషుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బర్త్ డే కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. సర్పంచ్ మేడేపల్లి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు సుందరరావు, శివ, అజయ్‌కర్, చింతా మహేష్, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: లక్ష్మీనరసింహపురంలో మాజీ మంత్రి కొడాలి నాని పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో రామేశ్వరరావు, బాబు, నాగూర్, శ్రీరాములు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

గుడ్లవల్లేరు: ప్రజల కోసం విధి నిర్వహణలో పోలీసు అమర వీరులు చేసిన త్యాగాలు మరువలేనివని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్లవల్లేరులో మంగళవారం ఆయన పోలీసు అమర వీరులకు నివాళులర్పించారు.

ప్రజా రక్షణే పోలీసు బాధ్యత

ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని ఏఎస్ఐ సాంబశివరావు అన్నారు. గుడ్లవల్లేరు పీఎస్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో ఉండే ఆయుధాలు, పోలీసు విధులపై అవగాహన కల్పించారు.

గుడివాడరూరల్‌లో..

గుడివాడరూరల్: పోలీస్ అమరవీరుల త్యాగాలపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోలీసుల విధులు, ఇతర వ్యవహారాలు, ఆయుధాల వినియోగం తదితర అంశాలపై మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నందివాడలో..

నందివాడ: అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నందివాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేములపల్లి నాగయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం పోలీస్ అమరవీరుల సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 100 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే రాము, కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో మంగళవారం యాక్సెంచర్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో బీబీఏ, బి.కాం, ఎం.కాంలకు చెందిన 100 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో ఈ ఎంపికలు జరిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అప్పారావు, కోశాధికారి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

27న సర్వసభ్య సమావేశం

స్థానిక ఏఎన్నార్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పరంధామారావు, డాక్టర్ ఎస్. కృష్ణ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు

పమిడిముక్కల: మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. రీసర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సభలకు రీసర్వే డీటీ, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, ఆర్ఐ హాజరవుతారని తెలిపారు. సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ముదినేపల్లి రూరల్: వరిసాగులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వేణుమాధవ్ అన్నారు. ముదినేపల్లి–1, 2 సచివాలయాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో వరిచేలు ఈనిక దశలో ఉన్నందున రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఏటా సీజన్లో ప్రతి రైతు కొంత విస్తీర్ణంలోనైనా ఈ సాగు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త వీధిలైట్లు ఏర్పాటు

మండవల్లి: మండవల్లిలో దెబ్బతిన్న వీధిలైట్ల స్థానంలో కొత్తలైట్లను మంగళవారం సర్పంచ్ మెండా ఝాన్సీ వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం కురుస్తున్న సమయంలో దారి సక్రమంగా కన్పించక రోడ్డు మీద పురుగు, పుట్రా మీద కాలు మోపే అవకాశం ఉంటుందన్నారు. ఈ కారణంగా ఎప్పటికప్పుడు వీధిలైట్లు వేయిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లిరూరల్: సింగరాయపాలెం–చేవూరు పాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. పలువురు దంపతులు తమ పిల్లలకు భారీ సంఖ్యలో అన్నప్రాసనలు చేయించారు. సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

రీసర్వే గ్రామసభలతో రైతులకు మేలు

కైకలూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ ఇబ్రహీం పేర్కొన్నారు. భుజబలపట్నం పంచాయతీ వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. మొత్తం 42 భూ సంబంధిత అర్జీలను రైతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురజాల రామతులసి, నాయకులు సీతారామరాజు, త్రినాథరాజు, వాసురాజు, వేణు, మాజీ సర్పంచ్ రామలక్ష్మి, శ్రీకాంత్, మండల సర్వేయర్ రమేష్, ఆర్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నిర్మూలన

గుడ్లవల్లేరు: గొర్రెలు, మేకల నట్టల నిర్మూలనా కార్యక్రమాన్ని కొతవరంలో చేపట్టారు. మంగళవారం వెటర్నరీ గుడ్లవల్లేరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్ టీకాలను వేశారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన చెప్పారు. వైద్యాధికారులు వీణాశ్రీ, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. స్వర్గీయ అరికెపూడి శివహర్ష స్మారకార్థం తండ్రి ఏఆర్‌కే చౌదరి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు. అనంతరం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి

ముదినేపల్లి రూరల్: పార్టీలకతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ వై.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ స్థానిక సంస్థల బలోపేతమే ధ్యేయంగా పని చేయాలన్నారు. సమావేశానికి ముందు కాకరవాడ సర్పంచ్ కాగిత రామరావు మృతికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సంతాపం తెలిపారు.

ఓటు నమోదుకు సహకరించాలి

పామర్రు: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కును పొందాలని పామర్రు తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు నమోదు కావాల్సిన వారు డిగ్రీ/డిప్లొమా(10+2+3) ఒరిజినల్ ప్రొవిజనల్ సర్టిఫికెట్, అటెస్టెడ్ జిరాక్స్ కాపీ, రెండు పాస్ పోస్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డ్/ఓటర్ ఐడీ/నివాస ధ్రువీకరణ జిరాక్స్‌లను, ఫారమ్–18 ద్వారా ఆన్‌లైన్‌లో రాష్ట్ర ఎన్నికల వెబ్‌సైట్‌లో కాని, లేదా ఆఫ్‌లైన్‌లో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, సీపీఎం తదితర పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కలిదిండి(కైకలూరు): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కలిదిండి మండల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా ఏ.రాజమోహన్, అధ్యక్షురాలిగా ఎస్.సౌభాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కోకా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఎంవీ.బేతాళరావు, పీవీ.సాగర్‌బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.ప్రసన్నకుమారి, జి.ఏసురాజు, బి.సరిత, ఎం.టెన్నిసన్, పి.హేమలత, ఎం.శ్రీనివాసరావు, బి.రామాంజనేయులు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధికి రూ.7.73 కోట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్, డ్రెయినేజీ కాలువల అభివృద్ధికి రూ.7.73 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కాలువల్లో జరిగిన అభివృద్ధి పనులు అసంతృప్తిగా ఉన్నాయని, నిర్లక్ష్యంగా పనులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇరిగేషన్ డీఈలు భరత్, శ్రీను, డ్రెయినేజీ డీఈ గణపతి, ఏఈలు కుమార్, అనిల్, బేగ్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్లకు స్వచ్ఛందంగా మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న కొల్లేరు పెద్దలు

కైకలూరు: ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కొల్లేరు గ్రామాల పెద్దలే చందాలు పోగు చేసుకుని ఇటీవల వరదలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఇటీవల కొల్లేరు గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లుకు నిధులు కేటాయించాలని పలువురు కొల్లేరు గ్రామాల పెద్దలు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కొల్లేరు సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బలే ఏసురాజు ఆధ్వర్యంలో కైకలూరు మండలం సర్కారు కాలువ నుంచి పందిరిపల్లిగూడెం, గోకర్ణపురం నుంచి పైడి చింతపాడు రోడ్డుకు పొక్లెయిన్‌తో మంగళవారం పనులు ప్రారంభించారు. గ్రామ పెద్దలు బలే సముద్రం, జయమంగళ సుబ్బరాజు, కొల్లేరు లంక గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన కలప మాయం!



రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం (ఫైల్)

మొవ్వ: గత నెల ఏడో తేదీన కురిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు మొవ్వ–చల్లపల్లి రహదారి పక్కనే ఉన్న ఓ భారీ వృక్షం నేలకు ఒరిగింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా కూచిపూడి పోలీసులు, రెవెన్యూ అధికారులు, మొవ్వ పంచాయతీ అధికారులు ఆ వృక్షాన్ని మిషన్ సాయంతో కట్ చేసి, రోడ్డు పక్కన ముక్కలుగా వదిలేశారు. ఆ రోడ్డు పక్కనే వదిలేసిన కలప ఏమైంది అనేది నేడు ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా సంఘటన జరిగిన మరుసటి రోజు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు వెల్లడించారు. ఆర్అండ్‌బీ ఏఈని అడిగితే తాను ఇటీవల బదిలీపై వచ్చానని దీనిపై విచారణ చేపడతామని పేర్కొన్నారు. కూచిపూడి ఎస్ఐ మాట్లాడుతూ తాను వృక్షం తొలగించిన సమయంలో వెళ్లానని, ఈ కలప వివాదంపై అధికారుల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు అందలేదని తెలిపారు. కాగా ఈ కలప వివాదం పై గ్రామస్తులు ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేయటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

సమన్వయంతో పని చేయండి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఫణీంద్ర

కైకలూరు: మండలాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ రెడ్డిబత్తుల ఫణీంద్ర అన్నారు. ఆలపాడు, పల్లెవాడ, భుజబలపట్నం పంచాయతీ, సచివాలయాలను మంగళవారం పరిశీలించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలపాడులో రహదారి అధ్వానంగా మారిందని వచ్చిన ఫిర్యాదులపై ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. పల్లెవాడ గ్రామంలో రైల్వేస్టేషన్ వద్ద ఇటీవల వరదలకు నీరు నిల్వ ఉండటంతో స్టేషన్‌కు చేరడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో పల్లెవాడ సర్పంచ్ దుట్టా మణితో కలిసి ఆయా ప్రాంతాలను చూశారు.